సాక్షి
రంగారెడ్డి
సోమవారం ∣ 19 ∣ జూన్ ∣ 2023



ధ్యానంతో ప్రయోజనాలు

ధ్యానంతో బహుళ ప్రయోజనాలు చేకూరు తాయని పిరమిడ్ స్పిరిచువల్ సొసైటీ ధ్యాన ప్రచారకర్త రవీందర్ తెలిపారు. 8లో▸



ఉచిత సేవలు ఒట్టిమాటే!

పెట్రోల్ బంకుల్లో వాహనదారులకు ఉచిత సేవలపై అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. 8లో▸



క్రికెట్ టోర్నీ విజేత ఆర్‌సీబీ

షాబాద్‌లో 8 రోజులుగా జరుగుతున్న ఎస్‌పీఎస్–2 క్రికెట్ పోటీలు ముగిశాయి. ముంబై ఇండియన్స్‌పై ఆర్‌సీబీ గెలుపొందింది. 8లో▸

న్యూస్‌రీల్

పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చే వరకు పోరాటం

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు

షాద్‌నగర్: నిరుపేదలకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు కేటాయించేంత వరకు పోరాటాన్ని ఆపేది లేదని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.రాజు స్పష్టం చేశారు. పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సరూర్‌నగర్‌లో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరసన చేపడితే పోలీసులు లాఠీచార్జీ చేసి అక్రమ కేసులు పెట్టడం సరికాదని అన్నారు. రాష్ట్రంలో ఎంతోమంది సొంతఇళ్లు లేక అవస్థలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములు ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోకుండా ఇళ్ల స్థలాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్న పేదలపై కేసులు నమోదు చేయడం సిగ్గుచేటన్నారు. పేదల పక్షాన పోరాడి ప్రభుత్వంపై మరింత ఒత్తిడి తెచ్చేలా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీను నాయక్, ఈశ్వర్ నాయక్, సాయిబాబ, మల్లేశ్, ఈశ్వర్, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీజీ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ రేపటితో ఆఖరు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూతో పాటు రాష్ట్రంలోని వివిధ వర్సిటీల్లో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, జర్నలిజం, లైబ్రరీ సైన్స్, ఎంఎస్‌డబ్ల్యూ తదితర పీజీ కోర్సుల ప్రవేశ పరీక్షలకు రూ.2000 అపరాధ రుసుముతో మంగళవారంతో గడువు ముగియనుంది. రూ.500 అపరాధ రుసుముతో దరఖాస్తుల స్వీకరణ గడువు ఆదివారంతో (ఈ నెల 18న) ముగిసినట్లు టీఎస్‌సీపీజీఈటీ–2023 కన్వీనర్ ప్రొ.పాండురంగారెడ్డి తెలిపారు. ఇప్పటివరకు 69 వేల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నట్లు వివరించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఎంఏ కోర్సు ప్రవేశాలకు 200 మంది ఇంజినీరింగ్ విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నట్లు చెప్పారు. అభ్యర్థులకు ఈ నెల 27 నుంచి హాల్‌టికెట్లు జారీ చేయనున్నట్లు, 30 నుంచి వచ్చే నెల 10 వరకు పీజీ ప్రవేశ పరీక్షలను నిర్వహించనున్నట్లు కన్వీనర్ చెప్పారు.

సమ్మర్ ఉత్సవ్ మేళా ప్రవేశం ఉచితం



ఖైరతాబాద్: పీపుల్స్ ప్లాజా వేదికగా ఏర్పాటు చేసిన సమ్మర్ ఉత్సవ్ మేళాలో అద్భుత రీతిలో ఆకట్టుకుంటున్న ఫిష్ టన్నెల్‌ను ఉచితంగా సందర్శించేందుకు పాఠశాల విద్యార్థులకు ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు నిర్వాహకుడు మీర్జా రఫీక్ బేగ్ తెలిపారు. ఆదివారం పీపుల్స్ ప్లాజాలో ఆయన మాట్లాడుతూ.. ఒకటి నుంచి పదో తరగతి చదివే విద్యార్థులకు ఈ నెల 19, 20, 21వ తేదీల్లో మూడు రోజుల పాటు మధ్యాహ్నం 12 నుంచి రాత్రి 10.30 గంటల వరకు తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని పాఠశాలల యాజమాన్యాలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.

ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో నిధి అగర్వాల్ సందడి

హఫీజ్‌పేట్: ఓల్డ్ హఫీజ్‌పేట్‌లో ఆదివారం సినీ తార నిధి అగర్వాల్ సందడి చేశారు. ఈ సందర్భంగా మంచిర్యాల ఎమ్మెల్యే దివాకర్‌రావు, ప్రముఖ దర్శకులు సంపత్ నంది, కార్తీక్ దండులతో కలిసి ఆమె ఓ హోటల్‌ను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

రేపు ఓయూలో డా.నాగయ్య ఎంపి థియేటర్ ప్రారంభం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో రూ.75 లక్షల వ్యయంతో నిర్మించిన డాక్టర్. జి నాగయ్య ఓపెన్ ఎయిర్ ఎంపి థియేటర్ మంగళవారం ప్రారంభం కానుంది. ఓయూ పూర్వవిద్యార్థి, డాక్టర్ నాగయ్య ఆర్థిక సహాయంతో క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియం పక్కన ఓపెన్ ఎయిర్ ఎంపిథియేటర్ నిర్మిస్తున్నారు. ఈ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు.



సీఎం సభ కోసం సిద్ధమవుతున్న వేదిక

సర్వం సిద్ధం

- నేడు జిల్లాకు సీఎం కేసీఆర్ రాక
- తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో మొక్కలు నాటనున్న ముఖ్యమంత్రి
- మ్యాక్ క్రికెట్ గ్రౌండ్‌లో బహిరంగ సభ
- మహేశ్వరం నుంచి 20 వేల మందిని తరలించాలని నిర్ణయం
- 25 వేల మొక్కలను సిద్ధం చేసిన ఫారెస్ట్ అధికారులు.. భారీ పోలీసు భద్రత
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి సబిత, సీఎస్ శాంతకుమారి, ఎంపీ రంజిత్‌రెడ్డి

సాక్షి, రంగారెడ్డిజిల్లా: దశాబ్ది వేడుకల్లో భాగంగా సోమవారం జిల్లాలో నిర్వహించే 'హరితహారం' కార్యక్రమానికి సీఎం కేసీఆర్ హాజరుకానున్నారు. మహేశ్వరం నియోజకవర్గం కందుకూరు మండలం తుమ్మలూరు అర్బన్ ఫారెస్ట్‌లో ఉదయం 11 గంటలకు మొక్కలు నాటి తెలంగాణ హరితహారం కార్యక్రమాన్ని ప్రారంభించనున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఫారెస్ట్ అధికారులు 25 వేల మొక్కలను సిద్ధం చేశారు. సీఎం రాక నేపథ్యంలో పోలీసులు, జిల్లా రెవెన్యూ అధికారులు అప్రమత్తమయ్యారు. ఫారెస్ట్ పక్కనే హెలీప్యాడ్‌ను సిద్ధం చేశారు. ఈ మేరకు ఆదివారం మంత్రి సబితారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ హరీశ్, ఫారెస్ట్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి ఏర్పాట్లను పరిశీలించారు.



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న మంత్రి సబితారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి, ఎంపీ రంజిత్‌రెడ్డి, కలెక్టర్ హరీశ్ తదితరులు

సభను విజయవంతం చేయాలి: మంత్రి సబితారెడ్డి

సీఎం కేసీఆర్ నేతృత్వంలో జిల్లా రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. అనేక పరిశ్రమలకు నెలవుగా నిలిచింది. ఆశించిన దానికంటే అధిక నిధులు జిల్లాకు కేటాయించారు. ఫ్యాబ్‌సిటీ, చందనవెల్లి పారిశ్రామికవాడ సహా ఫార్మాసిటీలను ఏర్పాటు చేశారు. అనేక కంపెనీలు ఇక్కడ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. విప్రో, అమేజాన్ వంటి అంతర్జాతీయ సంస్థలు ఇక్కడ వెలిశాయి. ఇప్పటికే ఫాక్స్‌కాన్ కంపెనీ భూమిపూజ కూడా చేసింది. ఉపాధి అవకాశాలు పుష్కలంగా లభిస్తున్నాయి. హరితహారం కార్యక్రమంతో తెలంగాణ పచ్చబడింది. ఈ ఏడాది హరితహారం కార్యక్రమం నా సొంత నియోజకవర్గం మహేశ్వరంలో ప్రారంభం కాబోతుండటం సంతోషంగా ఉంది. ఈ సందర్భంగా నిర్వహించే సభకు జిల్లా నుంచి భారీగా తరలిరావాలి. కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి.

వీఐపీలు, మహిళలు, పార్టీ ప్రముఖుల కోసం ప్రత్యేక గ్యాలరీలు ఏర్పాటు చేశారు.

బహిరంగ సభకు ఏర్పాట్లు

హరితహారంలో భాగంగా మొక్కలు నాటిన తర్వాత జిల్లా వాసులను ఉద్దేశించి సీఎం ప్రసంగించనున్నారు. ఇందుకోసం మ్యాక్స్ పక్కనే ఉన్న క్రికెట్ గ్రౌండ్‌లో సభా వేదికను ఏర్పాటు చేశారు. ప్రజలు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు, అధికారులు కూర్చొనేందుకు వీలుగా 15 వేల కుర్చీలను సమకూర్చారు. మంత్రి సబితారెడ్డి అధ్యక్షతన నిర్వహించే సభకు మహేశ్వరం, కందుకూరు, బాలాపూర్, కడ్తాల్ మండలాల నుంచి 20 వేల మందిని తరలించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు పార్టీ శ్రేణులు ఏర్పాట్లు చేస్తున్నాయి. సీఎం పర్యటన నేపథ్యంలో తుమ్మలూరు ఫారెస్ట్ పరిసరాలతో పాటు శ్రీశైలం జాతీయ రహదారిపై పటిష్ట పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. వాహనాల రాకపోకలకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. సభాస్థలికి సమీపంలోని ఖాళీ స్థలాల్లో పార్కింగ్ సదుపాయం కల్పించారు.

రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో పాల్గొనండి

ఎన్‌ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పిలుపు

మీర్‌పేట: రాజీవ్‌గాంధీ ఆన్‌లైన్ క్విజ్ పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్ పిలుపునిచ్చారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఆన్‌లైన్ పోటీల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో రంగారెడ్డి జిల్లా మొదటి స్థానంలో ఉండాలన్నారు. రానున్న రోజుల్లో దేశం, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టడం ఖాయమని జోస్యం చెప్పారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ నిరంకుశ పాలనను విద్యార్థులు, నిరుద్యోగ యువత తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఎన్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ఇన్‌చార్జి సద్దాం, జాతీయ కన్వీనర్ దినేష్‌సాగర్, జాతీయ కో ఆర్డినేటర్, జోనల్ ఇన్‌చార్జిలు ఫయాజ్, అఖిలేష్ యాదవ్, జిల్లా కార్యవర్గ సభ్యులు, నియోజకవర్గ, మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకట్



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సబితారెడ్డి

మహిళలకు మంచినీటి కష్టాలు దూరం

- మిషన్ భగీరథతో అవస్థలకు చెక్
- అంతా సీఎం కేసీఆర్ ఘనత
- నీళ్ల పండుగలో మంత్రి సబితారెడ్డి

కందుకూరు: మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నల్లాలు అందించి మహిళల తాగునీటి కష్టాలు దూరం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి అన్నారు. తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ముచ్చర్ల పరిధిలోని మిషన్ భగీరథ తాగునీటి శుద్ధీకరణ కేంద్రం వద్ద మంచినీళ్ల పండుగ నిర్వహించారు. ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డితో కలిసి మంచినీటి సరఫరాను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రక్షిత తాగునీరు అందిస్తుండటంతో సీజనల్ వ్యాధులు తగ్గాయని, ఫ్లోరోసిస్ సమస్యల నుంచి తెలంగాణ ప్రజలకు విముక్తి కలిగిందని అన్నారు. మిషన్ భగీరథ పథకం ద్వారా తెలంగాణలో సుమారు 23,839 గ్రామాల్లో 57.01 లక్షల ఇళ్లకు, మున్సిపాలిటీల్లో విలీనమైన 649 గ్రామాలకు, 121 మున్సిపాలిటీలు, అడవులు, కొండలపై ఉన్న 136 గ్రామీణ ఆవాసాలకు తాగునీరు అందుతుందన్నారు. మహేశ్వరం నియోజకవర్గంలో భవిష్యత్ అవసరాల దృష్ట్యా రూ.210 కోట్లతో నూతన పైప్‌లైన్లు, రిజర్వాయర్లు, ట్యాంకులు నిర్మిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణలో అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకం దేశంలోని ఇతర ప్రాంతాల్లో అమలు చేయడం గొప్ప విషయమన్నారు. ఇదంతా కేసీఆర్ దూరదృష్టితోనే సాధ్యమైందని కొనియాడారు. అంతకు ముందు ముచ్చర్లలో మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా కల్యాణలక్ష్మి చెక్కులతో పాటు ఫార్మాసిటీలో భూములు కోల్పోయిన రైతులకు ఇళ్ల స్థలాల సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మంద జ్యోతి, జెడ్పీటీసీ బొక్క జంగారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ చంద్రశేఖర్, వైస్ ఎంపీపీ శమంత, స్థానిక సర్పంచ్ రాంచంద్రారెడ్డి, ఎంపీటీసీ మల్లేశ్, ఇబ్రహీంపట్నం ఎంపీపీ కృపేష్, యాచారం జెడ్పీటీసీ జంగమ్మ, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ రసీదులతో మాయాజాలం

- త్రైమాసిక పన్ను చెల్లించకుండానే స్లిప్పులు
- భారీ ఎత్తున నష్టపోయిన వాహనదారులు
- మోసాలకు పాల్పడుతున్న దళారులు



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో త్రైమాసిక పన్ను చెల్లింపులపై నకిలీ రసీదుల దందా హల్‌చల్‌గా మారింది. రవాణాశాఖకు పన్ను చెల్లించకుండానే సాంకేతిక పరిజ్ఞానంతో నకిలీ రసీదులను సృష్టిస్తూ కొందరు దళారులు పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడుతున్నారు. నిబంధనల మేరకు చెల్లించాల్సిన పన్ను మొత్తాన్ని 30 నుంచి 50 శాతం వరకు తగ్గిస్తామంటూ వాహనదారులను బ్రోకర్లు ఆకట్టుకుంటున్నారు. దీంతో వాళ్ల మాటలు నమ్మి డబ్బు చెల్లించిన వాహనదారులకు నకిలీ రసీదులను చేతికిచ్చి ఉడాయిస్తున్నారు. రవాణాశాఖ అందజేసే రసీదులకు, దళారులు ఇచ్చేవాటికి ఎలాంటి తేడా లేకపోవడంతో వాహనదారులు తేలికగా నమ్ముతున్నారు. పన్ను చెల్లించిన తర్వాత ఆర్టీఏ అధికారులను సంప్రదిస్తే సదరు వాహనాలపై చెల్లించాల్సిన పన్నులు పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. దీంతో తాము మోసపోయినట్లు వాహనదారులు లబోదిబోమంటున్నారు. నగరంలోని ఒక ప్రాంతీయ రవాణా కార్యాలయం పరిధిలోనే దళారులు సుమారు 30 కార్లపై ఇలాంటి నకిలీ రసీదులను అందజేశారు. ప్రతి 3 నెలలకు ఒకసారి రూ.5,600 చెల్లించాల్సిన వినీత్ అనే బ్రోకర్ రూ.3600 చొప్పున వసూలు చేసి నకిలీ రసీదులు చేతికిచ్చారని బాల్‌రెడ్డి అనే వాహనదారు తెలిపారు. పన్ను చెల్లించామనే భరోసాతో ఆర్టీఏకు వెళితే పన్ను పెండింగ్‌లో ఉన్నట్లు తేలిందన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా ఇదే దందా..

- హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతీయ రవాణా కార్యాలయాల పరిధిలోనూ బ్రోకర్లు ఇదే తరహా మోసాలకు పాల్పడడం గమనార్హం. కరీంనగర్, వరంగల్, ఖమ్మం తదితర జిల్లాల్లో ఇలాంటి నకిలీ రసీదులు వెలుగు చూశాయి. రాయితీ లభిస్తుందనే ఆశతో ఉన్న వందలాది మంది వాహనదారులను లక్ష్యంగా చేసుకొని అక్రమ దందా కొనసాగుతోంది. ఒకవైపు రవాణా కార్యాలయాల్లో దళారులుగా కొనసాగుతూనే సాఫ్ట్‌వేర్‌లో మాయాజాలం చేసి నకిలీ రసీదులకు తెరతీశారు.
- రాష్ట్రవ్యాప్తంగా ఈ దందా కొనసాగుతున్నప్పటికీ ఇటు ఆర్టీఏ అధికారులు, అటు పోలీసులు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం. మరోవైపు అధికారులతో చనువుగా ఉండే ఏజెంట్లే ఇలాంటి మోసాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్టీఏ సాంకేతిక పరిజ్ఞానం పట్ల బాగా అవగాహన ఉన్న వాళ్లే నకిలీలను సృష్టిస్తున్నారని వాహనదారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. పలు ఆర్టీఏ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగులు తాము చేయాల్సిన విధులను 'సహాయకులకు' అప్పగించి ప్రేక్షకపాత్రకు పరిమితమవుతున్నారు. దీంతో సాంకేతిక పరిజ్ఞానం తస్కరణకు గురవుతోందనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

రుణమాఫీ ఎప్పటికో..?

- బ్యాంకర్ల నుంచి రైతులపై పెరుగుతున్న ఒత్తిడి
- వ్యక్తిగత ఖాతాలను ఫ్రీజింగ్ చేస్తున్న వైనం
- ఇప్పటివరకు రూ.25 వేలలోపు రుణాలు మాత్రమే మాఫీ
- ఆపై తీసుకున్నవారికి తప్పని నిరీక్షణ



షాబాద్‌లో పత్తి పంటలో పనిచేస్తున్న రైతు (ఫైల్)

షాబాద్: రుణమాఫీ కోసం రైతులు నిరీక్షిస్తున్నారు. ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ అచరణకు నోచుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రుణాలు తిరిగి చెల్లించాలని బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పలుమార్లు రైతుల ఖాతాలు ఫ్రీజింగ్ చేస్తున్నారు. మరోవైపు వడ్డీలు చెల్లించి ఖాతాలను పునరుద్ధరించుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం రూ. 25వేల రుణాలను మాత్రమే మాఫీ చేసింది. రూ.50వేలు అంతకంటే ఎక్కువ రుణాలపై ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులకు ఎదురుచూపులు తప్పడంలేదు.

నాలుగు దశల్లో..

రాష్ట్రవ్యాప్తంగా 2018 డిసెంబర్ 11 నాటికి ఉన్న పంట రుణాల బకాయిలను రూ.లక్షలోపు వరకు మాఫీ చేస్తామని 2020 మార్చిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మొదటి విడతగా రూ.25వేలలోపు రుణం తీసుకున్న రైతులందరికీ ఒకేసారి తొలిదశలో చెల్లించేందుకు నిర్ణయించగా, ఆ తర్వాత రూ.50వేలు, ఆపై రూ.75వేల వరకు ఉన్న రుణాలను, చివరన రూ.లక్ష వరకు ఉన్న వాటిని ఇలా నాలుగు దశల్లో రుణమాఫీ చేయనున్నట్లు ప్రకటించింది. రూ.50వేలలోపు రుణం తీసుకున్న రైతులకు సంబంధించిన రుణాలను 2021 ఆగస్టు 16 నుంచి 31వ తేదీలోపు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. జిల్లాలో ఇప్పటివరకు సుమారు రూ.25వేలలోపు మాత్రమే రుణమాఫీ చేశారు. మిగతా రైతులు మాఫీ కోసం ఎదురుచూస్తున్నారు.

అధిక వడ్డీ వసూలు..

జిల్లాలో 97,359 మంది రైతులు ఉండగా రూ.357.62 కోట్లు వివిధ బ్యాంకుల్లో బకాయిలు ఉన్నాయి. బ్యాంకులో తీసుకున్న రుణం మాఫీ అవుతుందని రెండు, మూడేళ్లుగా పంట రుణాలు పునరుద్ధరించుకోలేదు. ఈ క్రమంలో బ్యాంకులు ప్రతి మూడు, ఆరు నెలలకు వడ్డీ జమ చేస్తున్నాయి. గత యాసంగి వరకు రుణమాఫీ కాకపోవడంతో రుణాలను పునరుద్ధరణ చేసుకోని రైతులను బ్యాంకు అధికారులు గుర్తించి వారి వ్యక్తిగత ఖాతాల నుంచి ఆర్థిక లావాదేవీలను నిలిపేశారు. విధిలేని పరిస్థితుల్లో తీసుకున్న రుణంపై వడ్డీ మీద వడ్డీ చెల్లించి ఖాతాలను పునరుద్ధరించుకున్నారు. అధిక వడ్డీలు చెల్లించి చాలా మంది రైతులు ఆర్థికంగా నష్టపోయారు.

ఎదురుచూస్తున్నాం..



పంట రుణాల మాఫీ కోసం ఏళ్ల నుంచి ఎదురుచూస్తున్నాం. రూ.50వేల రుణం ఉంది. ఇప్పటికీ వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వ హామీ ప్రకారం రెండో విడతలో రూ.50వేల రుణాలు మాఫీ చేసి న్యాయం చేయాలి.

– బండ నర్సింహారెడ్డి, రైతు, మన్‌మర్రి

బ్యాంకు అధికారుల నుంచి ఒత్తిడి



రూ.50వేల వరకు రుణం మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం నేటికీ మాఫీ చేయలేదు. బ్యాంకు అధికారుల నుంచి అప్పు కట్టాలని ఒత్తిడి వస్తోంది. రుణాలను మాఫీ చేసి కష్టాల నుంచి గట్టెక్కించాలి. లేదంటే బ్యాంకు అప్పు తీర్చడం కోసం మరోఅప్పు చేయాల్సి వస్తుంది.

– క్యామ నారాయణ, రైతు, కుమ్మరిగూడ

మాఫీపై సమాచారం లేదు

రైతు రుణమాఫీకి సంబంధించి మాకెలాంటి సమాచారం లేదు. వారి పేరుతో ఖాతాల్లో రుణం ఉన్నంత వరకు వడ్డీ పెరుగుతూనే ఉంటుంది. ఖాతాలు పరిష్కారం అయ్యే వరకు వడ్డీ చెల్లించాల్సిందే. రుణమాఫీ నేరుగా రైతు ఖాతాలకే జమ చేస్తారు.

– సాయి ప్రశాంత్, బ్యాంకు మేనేజర్, నాగర్‌గూడ

లోటస్‌పాండ్‌లో ఎయిరేటర్లు

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని లోటస్‌పాండ్‌లో అర్బన్ డైవర్సిటీ అధికారులు ఎయిరేటర్లు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం లోటస్‌పాండ్ చెరువులో ఆక్సిజన్ అందక వేలాది చేపలు మృత్యువాతపడిన నేపథ్యంలో ఫిషరీస్ శాఖ సూచనల మేరకు అధికారులు ఈ చెరువులో రెండు చోట్ల ఎయిరేటర్లు ఏర్పాటు చేశారు. ఇవి నీళ్లలో తిరుగుతూ నీటిని కదిలిస్తుండటంతో ఆక్సిజన్ ఉత్పత్తి పెరుగుతుందని పార్కు అధికారులు తెలిపారు. ఒక్కో ఎయిరేటర్‌కు రూ.70 వేల వరకు ఖర్చు చేసినట్లు చెప్పారు. చెరువులో నీరు పరిశుభ్రంగా ఉండేలా తగిన చర్యలు తీసుకుంటున్నామని వారు పేర్కొన్నారు. ఇటీవల నీటితో పాటు పరిశుభ్రత కరువై ఈ పార్కు వాకర్ల ఆగ్రహానికి గురి కావాల్సి వచ్చింది. మేల్కొన్న అధికారులు అభివృద్ధిపై దృష్టిసారించి ఒక్కొక్కటిగా పనులన్నీ చేస్తున్నారు.

అంబేడ్కర్ అందరివాడు



మాట్లాడుతున్న ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, చిత్రంలోఎమ్మెల్యే అంజయ్యయాదవ్ తదితరులు

బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

కొందుర్గు: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కులానికో, మతానికో, వర్గానికో సంబంధించిన వ్యక్తి కాదని.. అందరివాడని బీఎస్పీ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ మండలం తూంపల్లిలో ఆదివారం అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అంబేడ్కర్ మనందరికీ రాజ్యాంగం అనే గొప్ప గ్రంథాన్ని అందించి దేశానికే మార్గదర్శకుడయ్యారని కొనియాడారు. అంబేడ్కర్ విగ్రహాన్ని పెట్టుకున్నంతమాత్రాన సరిపోదని ఆయన ఆశయ సాధన కోసం అందరూ కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యవ్యవస్థలో ఓటు విలువ చాల గొప్పదని.. డబ్బులు, మద్యానికి అమ్ముకోకూడదన్నారు. సరైన నాయకుడికి ఓటువేసి దేశాభివృద్ధికి పాటుపడాలని సూచించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీర్లపల్లి శంకర్, జెడ్పీటీసీ స్వరూప, ఎంపీటీసీ రజిత, సర్పంచ్ సంతోష, వివిధ పార్టీల నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.